సాక్షి
ఆదిలాబాద్

బుధవారం ׀ 10 ׀ జూలై ׀ 2024

రిమ్స్‌లో గ్రాడ్యుయేషన్ డే

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ నర్సింగ్ కళాశాలలో మంగళవారం రాత్రి 2019–20 బ్యాచ్ నర్సింగ్ గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.



గరిష్టం/కనిష్టం
32.0/26.0

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

వరదలపై అప్రమత్తంగా ఉండాలి



సాత్నాల ప్రాజెక్ట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

జైనథ్: వరదల విషయంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం ఆయన ఇరిగేషన్ అధికారులతో కలిసి మండలంలోని కొరటా–చనాఖా బ్యారేజ్, హట్టిఘాట్ పంప్‌హౌస్, సాత్నాల ప్రాజెక్టును పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. సాత్నాల ప్రాజెక్ట్ వద్ద గేట్ల నిర్వహణ, నీటిమట్టం తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతేడాది భారీ వర్షాల కారణంగా జరిగిన నష్టం, రవాణా ఇబ్బందుల దృష్ట్యా ఈసారి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కలెక్టర్ వెంట ఇరిగేషన్ ఎస్‌ఈ పి రాము, డీఈ విఠల్, తులసీరాం, మనోహర్, శ్రీనివాస్, తదితరులున్నారు.

మద్యం అక్రమంగా విక్రయిస్తే చర్యలు



మాట్లాడుతున్న హిమశ్రీ

బేల: మద్యం అక్రమంగా విక్రయిస్తే చర్యలు తప్పవని జిల్లా ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ హిమశ్రీ అన్నారు. మండలంలోని మాంగ్రుడ్ గ్రామంలో బెల్టు షాపుల నిర్వహణ తీరు, మద్యం అక్రమ అమ్మకాలపై స్థానిక మహిళలు గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఈ మేరకు గ్రామ మహిళలతో ఆమె మంగళవారం సమావేశమయ్యారు. మద్యపాన నిషేధం కోసం గ్రామంలో మహిళల భాగస్వామ్యంతో గ్రామ అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా మద్యం అమ్మితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఇందులో ఎక్సైజ్ సీఐ విజేందర్, బేల ఎస్సై రాధిక, మాజీ సర్పంచ్ పూజ, మహిళా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీతక్క జన్మదిన వేడుకల్లో వర్గపోరు



వాగ్వాదానికి దిగిన కాంగ్రెస్ నాయకులు

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలోని ప్రజా సేవాభవన్‌లో మంగళవారం నిర్వహించిన మంత్రి సీతక్క జన్మదిన వేడుకల్లో పార్టీ నాయకుల వర్గపోరు బయటపడింది. సీనియర్లకు ప్రాధాన్యతనివ్వడం లేదని, ప్రొటోకాల్ పాటించడం లేదంటూ ఆగ్రహించిన ఓ వర్గం నాయకులు మరో వర్గం నాయకులను ప్రశ్నించారు. దీంతో ఇరు వర్గాల నడుమ వాగ్వాదం చోటు చేసుకుంది. గొడవ ముదిరే అవకాశముందని గుర్తించిన పలువురు ముఖ్య నాయకులు ఆందోళనకు దిగిన వారికి సర్ది చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ జహీర్ రంజానీ, పట్టణ అధ్యక్షుడు నగేశ్, నాయకులు శ్రీలేఖ, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటం

ఆదిలాబాద్‌టౌన్: విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటం చేస్తామని ఏబీవీపీ నాయకులు అన్నారు. నేతాజీ చౌక్‌లో మంగళవారం ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. అంతకుముందు వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. దేశం కోసం, జాతి కోసం రాజకీయాలకు అతీతంగా ఏబీవీపీ పనిచేస్తుందన్నారు. విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు విఘ్నేష్, ఉదయ్, నిఖిల్, మహేశ్, అక్షయ్ పాల్గొన్నారు.

కదలిక వచ్చినట్లేనా..

- 'కొరటా–చనాఖా'పై కాంగ్రెస్ సర్కార్ ఫోకస్
- తుది దశలో బ్యారేజ్ పనులు
- ప్రభుత్వ ప్రాధాన్యత క్రమంలో చోటు



కొరటా–చనాఖా బ్యారేజ్ (ఫైల్)

సాక్షి,ఆదిలాబాద్: దిగువ పెన్‌గంగపై నిర్మిస్తున్న కొరటా–చనాఖా బ్యారేజ్‌ను వినియోగంలోకి తేవడంలో కమ్ముకున్న నీలినీడలు తొలుగుతున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణాలను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో ఈ బ్యారేజ్‌పై ఇక కదలిక వచ్చినట్లేనా అనే చర్చ సాగుతోంది. బీఆర్‌ఎస్ సర్కారు ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఈ ప్రాజెక్టు నిర్మాణానికి పూనుకుంది. చివరి దశలో ఉండగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో ఈ ప్రభుత్వం ప్రాజెక్టుపై దృష్టి సారిస్తుందా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్న వేళ దృష్టి సారించడం గమనార్హం.

ప్రాజెక్టు స్వరూపం..

లోయర్ పెన్‌గంగపై తెలంగాణ–మహారాష్ట్ర నది భూభాగాన్ని కలుపుతూ కొరటా–చనాఖా బ్యారేజ్ నిర్మాణానికి రూ.1,227 కోట్ల అంచనా వ్యయంతో 2015–16లో పరిపాలన అనుమతి ఇచ్చారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలోని రెండు మండలాలు, బోథ్ నియోజకవర్గంలో ఒక మండలం, మొత్తంగా 51 వేల ఎకరాలకు సాగునీరు అందించేలా ప్రణాళిక రూపొందించారు. దీంట్లో భాగంగా బ్యారేజ్, దానికి కొద్ది దూరంలో పంప్‌హౌస్, కాలువల నిర్మాణం, డిస్ట్రిబ్యూటరీ, పిప్పల్‌కోటి రిజర్వాయర్ పనులు చేపట్టాలి. ఇందులో బ్యారేజ్, పంపుహౌస్, ఎల్‌పీపీ కెనాల్ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. డిస్ట్రిబ్యూటరీ, దాని కింద మైనర్స్, సబ్ మైనర్స్ నిర్మించాలి. వీటికి సంబంధించి పనులే ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్నాయి. వీటన్నింటికి సంబంధించి భూసేకరణ, నిర్మాణ వ్యయం అంచనా వేసి గతంలోనే ప్రభుత్వానికి నివేదిక ఇవ్వడం జరిగింది. ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన పక్షంలో మిగతా పనులు పూర్తవుతాయి. కాగా ఈ ప్రాజెక్టు సంబంధించి పంప్‌హౌస్ వద్ద ఇది వరకే డ్రైరన్, వెట్‌రన్ నిర్వహించింది. ఇందులో భాగంగా ఎల్‌పీపీ కెనాల్‌లోకి నీళ్లు ఎత్తిపోయడాన్ని పరిశీలన చేశారు. అయితే ఎల్‌పీపీ ప్రధాన కెనాల్ పనులు పూర్తయినప్పటికీ డిస్ట్రిబ్యూటరీ, మైనర్స్, సబ్ మైనర్స్ పనులు పెండింగ్‌లో ఉండటంతో నీళ్లను పారించలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పెండింగ్ పనులను పూర్తి చేసిన పక్షంలో ఎల్‌పీపీ కెనాల్ ద్వారా 37,500 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనుంది.

ఇదీ పరిస్థితి..

డిస్ట్రిబ్యూటరీ సిస్టమ్ డి–14 నుంచి డి–19 వరకు నిర్మించాలి. దీనికి సంబంధించి ఇంకా 800 ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. దీనికి సుమారు రూ.100 కోట్ల వరకు అవసరమని పేర్కొంటున్నారు. డిస్ట్రిబ్యూటరీ సిస్టమ్ నిర్మాణం కోసం రూ.150 కోట్లు అవసరమని అధికారులు పేర్కొంటున్నారు. మొత్తంగా ప్రభుత్వం రూ.250 కోట్లు మంజూరు చేసిన పక్షంలో డిస్ట్రిబ్యూటరీ పనులు పూర్తయి ఎల్‌పీపీ కెనాల్ ద్వారా ఆయకట్టుకు సాగు నీళ్లు అందించే వీలుంటుంది. ఇక పిప్పల్‌కోటి రిజర్వాయర్, కొరాట–చనాఖా కెనాల్ నిర్మాణం పనులు చేపట్టాల్సి ఉంది. దీని ద్వారా మరో 13,500 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందుతుంది. మొత్తంగా 51 వేల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందించాలనే లక్ష్యం చేరుతుంది.

'ధరణి' దరఖాస్తులు పరిష్కరించాలి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



వీసీలో పాల్గొన్న కలెక్టర్, ఐటీడీఏ పీవో

కైలాస్‌నగర్: ధరణి పెండింగ్ దరఖాస్తులు పది రోజుల్లోగా పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో మంగళవారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వన మహోత్సవం, ప్రజాపాలన సహాయకేంద్రాలు, మహిళాశక్తి, అమ్మ ఆదర్శ పాఠశాల పనులు, సీజనల్ వ్యాధుల కట్టడి విద్యారంగ సమస్యలు, ధరణి, ఉద్యోగుల బదిలీలపై సమీక్షించి పలు సూచనలు చేశారు. పారి శుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వైద్యాధికారులు అప్రమత్తంగా ఉంటూ రోగాలు ప్రబలకుండా శ్రద్ధ వహించాలన్నారు. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మీ సేవా కేంద్రాలు, మహిళా శక్తి క్యాంటీన్, మైక్రో ఎంటర్‌ప్రైజెస్ ఏర్పాటుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇందులో కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, జెడ్పీ సీఈవో రత్నమాల, డీఆర్డీవో సాయన్న అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరుశాతం పెంచాలి

నార్నూర్: ప్రభుత్వ కళాశాలల్లో విదార్థుల ప్రవేశాలతోపాటు హాజరుశాతం పెంచాలని డీఐఈవో రవీందర్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులతో పాటు తరగతి గదులను పరిశీలించారు. సోమవారం కురిసిన భారీ వర్షానికి వచ్చిన వరద నీరు గదుల్లో నిలిచిపోయింది. ఈ మేరకు వెంటనే చర్యలు చేపట్టాలని ప్రిన్సిపాల్ మహేందర్‌ను ఆదేశించారు. అనంతరం విద్యార్థులు, సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు.

కౌలు రైతులకు రుణాలందించాలి

గుడిహత్నూర్: కౌలు రైతులకు కౌలు భూమిపై రుణాలందించాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కౌలు రైతులు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు నోచుకోవడం లేదన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సీనియారిటీ జాబితా ప్రకటన

కైలాస్‌నగర్: జిల్లా పంచాయతీ శాఖలో బదిలీల ప్రక్రియ కొనసాగుతుంది. బాసర జోన్ పరిధిలో జరిగే గ్రేడ్–1, 2, 3 కార్యదర్శుల సీనియారిటీ జాబితాను సిద్ధం చేసిన అధికారులు మంగళవారం ప్రకటించారు. గ్రేడ్–1లో ఎనిమిది మందికి గాను ఒకరు, గ్రేడ్–2లో 09 మందికి నలుగురు, గ్రేడ్–3లో 57 మందికి 41 మంది నాలుగేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్నారు. వీరికి తప్పనిసరిగా బదిలీ కానుంది. ఈమేరకు ఆప్షన్లు ఇచ్చుకోవాలని అధికారులు చెబుతున్నారు. అలాగే మల్టీజోన్ పరిధిలో జరిగే మండల పరిషత్ అధికారులు జిల్లాలో 17 మందికి గాను 15 మంది నాలుగేళ్ల సర్వీస్ పూర్తి కావడంతో పాటు అందరూ జిల్లావాసులే. దీంతో వీరంతా తప్పనిసరిగా బదిలీ కానున్నట్లు తెలుస్తోంది. ఇక జేపీఎస్, ఓపీఎస్‌లకు సంబంధించిన సీనియారిటీ జాబితా ఇంకా కొలిక్కి రాలేదు. మంగళవారం రాత్రి వరకు అధికారులు కసరత్తు చేపట్టారు.బుధవారం ప్రకటించే అవకాశముంది. ఇందులో పెద్ద ఎత్తున బదిలీలు అయ్యే అవకాశమున్నట్లుగా అధికా రులు చెబుతున్నారు. జిల్లాలోని మెజార్టీ పంచాయతీల్లో కొత్త కార్యదర్శులు రానున్నట్లుగా పేర్కొంటున్నారు.

'మహాలక్ష్మి' లేఖలు

- లబ్ధిదారులకు పథకం ఉద్దేశాన్ని వివరిస్తూ..
- రేషన్ డీలర్ల ద్వారా అందజేత



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేరిట వచ్చిన లేఖ

కైలాస్‌నగర్: మహిళల వంటింటి కష్టాలు తొలగించడంతో పాటు పేదలపై ఆర్థికభారం తగ్గించాలనే ఉ ద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహాలక్ష్మి పథకాన్ని అమలు చేస్తోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆహార భద్రత కార్డు కలిగి ఉండి, ప్ర జాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారికి ఈ పథకం కింద ఏడాదికి ఆరు సిలిండర్లను సబ్సిడీపై అందజేస్తోంది. సబ్సిడీ నగదును నేరుగా లబ్దిదారులకు ఇవ్వకుండా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చే స్తోంది. అయితే చాలా మంది లబ్ధిదారులు తమకు సబ్సిడీ రావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సబ్సిడీ పొందుతున్న వారికి పథకం ఉద్దేశాన్ని వివరించడంతో పాటు సబ్సిడీని బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నట్లుగా తెలుపుతూ ప్రభుత్వం ప్రత్యేకంగా లేఖలు పంపిస్తోంది. లబ్ధిదారుల అడ్రస్‌లతో జిల్లాకు చేరిన ఈ లేఖలను రేషన్ డీలర్ల ద్వారా వారికి అందజేస్తున్నారు.

జిల్లాలో 94వేల మందికి లబ్ధి

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా మహాలక్ష్మి పథకం కింద రూ.500కే వంట గ్యాస్ సిలిండర్‌ను రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తోంది. జిల్లాలో ఈ పథకం లబ్ధి కోసం సుమారు 2లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఎల్‌పీజీ కనెక్షన్, బ్యాంకు అకౌంట్, ఆధార్ నంబర్ వంటి వివరాలు సక్రమంగా ఉండి సిలిండర్లు పొందిన వారికి రాయితీ చెల్లిస్తోంది. ఇప్పటి వరకు జిల్లాలో 94వేల మంది లబ్ధి పొందారని జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారులు చెబుతున్నారు. వారికి రావాల్సిన సబ్సిడీని డీబీటీ విధానంలో లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లుగా పేర్కొంటున్నారు.

లబ్ధిదారుల పేరిట లేఖలు

మహాలక్ష్మి పథకం లబ్దిదారులకు వారి చిరునామాల పేరిట రాష్ట్ర ప్రభుత్వం లేఖలను పంపిస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిల ఫొటోలు, ప్రభుత్వ లోగోతో కూడిన లేఖను లబ్ధిదారులకు పంపిస్తున్నారు. ప్రియమైన అక్కా చెల్లెళ్లకు అని సంబోధిస్తూ ఇచ్చిన మాటకు కట్టుబడి మహాలక్ష్మి ఎల్‌పీజీ పథకాన్ని అమలు చేస్తున్నామని గత మూడేళ్ల వినియోగం ఆధారంగా లబ్ధిదారులకు సిలిండర్లను అందజేస్తున్నట్లుగా పేర్కొన్నారు. సబ్సిడీ నగదును డీబీటీ విధానంలో లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లుగా అందులో వెల్లడించారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సంతకం, ఇతర వివరాలతో కూడిన ఈ లేఖలను పోస్టల్ ద్వారా లబ్ధిదారుల చిరునామాతో జిల్లాలోని రేషన్ డీలర్లకు చేరాయి. డీలర్లు వారికి అందిన లేఖలను బియ్యం కోసం వచ్చే లబ్ధిదారులకు అందజేస్తున్నారు. ఈ లేఖలతో పాటు కొంత మంది లబ్ధిదారుల ఫోన్లకు సీఎం రేవంత్‌రెడ్డి సందేశాన్ని కూడా మెసేజ్‌ల రూపంలో పంపుతున్నట్లుగా అధికారులు చెబుతున్నారు.

నిరంతర సాధనతోనే విజయం



విజేతలతో పార్థసారథి, కోచ్ కృష్ణ

ఆదిలాబాద్: నిరంతర సాధనతో గొప్ప నైపుణ్యాలతో పాటు విజయాలు అలవడుతాయని జిల్లా గిరిజన క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జిల్లాస్థాయి స్విమ్మింగ్ ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించారు. పలు విభాగాల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లాకు చెందిన స్విమర్స్ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరుస్తుండడం శుభపరిణామమన్నారు. ఇందుకోసం స్థానిక శిక్షకుల కృషి ప్రశంసనీయమన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారు రాష్ట్రస్థాయి పోటీల్లోనూ సత్తా చాటాలని ఆకాంక్షించారు. విజేతలు ఈనెల 13, 14 తేదీల్లో సికింద్రాబాద్‌లో నిర్వహించనున్న జూనియర్, సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని కోచ్ కృష్ణ తెలిపారు. అనంతరం విజేతలకు మెడల్స్ ప్రదానం చేశారు. ఇందులో శిక్షకుడు చంద్రకాంత్ తదితరులున్నారు.

బదిలీ ఆప్షన్.. టెన్షన్!

- జిల్లాలో ఒకటే మున్సిపాలిటీ
- సిద్ధమైన సీనియారిటీ జాబితా
- ట్రాన్స్‌ఫర్.. ఇక మరో జిల్లాకే
- అర్హుల్లో మొదలైన ఆందోళన



ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్‌లో పని చేసే పలువురు ఉద్యోగుల బదిలీల్లో వింత ప రిస్థితి నెలకొంది. స్థానికంగా నాలుగేళ్ల సర్వీస్ పూర్తి చేసుకుని జిల్లా యూనిట్‌గా జరిగే బదిలీలకు అర్హులైన వారిలో ఆందోళన వ్యక్తమవుతుంది. సీనియారిటీ జాబితా ఇప్పటికే సిద్ధం కాగా ఆప్షన్ల ప్రక్రియ మంగళవారం నుంచి మొదలైంది. జిల్లాలో ఏకైక మున్సిపాలి టీ ఉండటంతో తాము ఎక్కడికి ఆప్షన్లు ఇచ్చుకోవాలని సదరు ఉద్యోగులు ఆందోళనకు గురవుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులను సంప్రదించగా పొరుగు జిల్లాలోని మున్సిపాలిటీలకు ఆప్షన్ ఇచ్చుకోవాలని సూచిస్తుండటం వారిని టెన్షన్‌కు గురి చేస్తోంది. అలా చేస్తే తాము ఇతర జిల్లాలకు వెళ్లాల్సి వస్తోందని, తద్వారా రిటైర్మెంట్ వరకు అక్కడే ఉండక తప్పకపోవచ్చనే ఆవేదన వ్యక్తమవుతోంది.

13 మందితో సీనియారిటీ జాబితా

ప్రభుత్వం ఉద్యోగుల సాధారణ బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఆదిలాబాద్ బల్దియాలో పనిచేసే వారి సీనియారిటీ జాబితా సిద్ధం చేశారు. ఒకే చోట నాలుగేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న వారిని తప్పనిసరిగా బదిలీ చేయాలనే ప్రభుత్వ ఆదేశాలున్నాయి. ఇందులో భాగంగా ఐదుగురు జూనియర్ అసిస్టెంట్లు, ముగ్గురు బిల్‌కలెక్టర్లు, మరో ఐదుగురు అటెండర్లను గుర్తించారు. సీనియారిటీ జాబితాలను నోటీసుబోర్డుపై ప్రకటించారు. వారు ఎక్కడికి బదిలీ కోరుకుంటున్నారనే వివరాలతో సదరు ఉద్యోగులు ఆప్షన్లు ఇచ్చుకోవాల్సి ఉంది.

ఆప్షన్ ఇచ్చేదెలా..

అటెండర్, బిల్‌కలెక్టర్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులన్నీ జిల్లా యూనిట్‌గా బదిలీ చేయాల్సినవే. అయితే జిల్లాలో కేవలం ఒకే ఒక మున్సిపాలిటీ ఉంది. ఈ లెక్కన వారిని జిల్లా పరిధిలో బదిలీ చేసే అవకాశం లేదు. మంగళవారం నుంచి ఆప్షన్ల ప్రక్రియ షురూ కావడంతో సదరు ఉద్యోగులు తాము ఎక్కడికి ఆప్షన్ ఇచ్చుకోవాలంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులను అడిగితే పక్క జిల్లాలోని మున్సిపాలిటీలకు ఇచ్చుకోవాలంటూ సూచిస్తున్నట్లుగా చెబుతున్నారు. బాసర జోన్‌లోని నిర్మల్ మున్సిపల్ కార్యాలయానికి ఆప్షన్ ఇచ్చినా అది అంతర్‌జిల్లా కిందకు వస్తుందే తప్ప జిల్లా యూనిట్ కాదు. ఒకవేళ వారిని నిర్మల్ మున్సిపల్ కార్యాలయానికి బదిలీ చేస్తే జిల్లా మారిపోవడంతో పదవీ విరమణ వరకు అదే జిల్లాలో పని చేయాల్సి వస్తోందని సదరు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 12వరకు ఆప్షన్లకు గడువు ఉన్నందున దీనిపై స్పష్టతనిచ్చి తమకు న్యాయం చేయాలంటూ సదరు ఉద్యోగులు కోరుతున్నారు.

క్లుప్తంగా

డాక్టరేట్‌ గ్రహీతకు సన్మానం



కిషన్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

నిర్మల్‌ఖిల్లా: భైంసా మండలం ఎగ్గాం గ్రామానికి చెందిన పోగుల కిషన్‌ ఇటీవల డాక్టరేట్‌ పట్టా పొందగా మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతనిని సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్‌ డాక్టర్‌ జే భీమారావు మాట్లాడుతూ.. 'ఆధునిక సమాజంలో ప్రజాస్వామ్యం.. దాని పరిణామక్రమ అన్వేషణ' అనే అంశంపై కిషన్‌ రాజస్థాన్‌ విశ్వవిద్యాలయం నుంచి సిద్ధాంత పత్ర సమర్పణ చేసి పీహెచ్‌డీ పట్టా పొందడం గర్వకారణమని పేర్కొన్నారు. ప్రస్తుతం కిషన్‌ ఆదిలాబాద్‌ జిల్లాలోని ఉట్నూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒప్పంద అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్నారు. కిషన్‌ను పలువురు అధ్యాపకులు శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు నర్సయ్య, రవికుమార్‌, శంకర్‌ తదితరులున్నారు.

రాష్ట్రస్థాయిలో మెరిసిన యోగేంద్ర సింగ్‌



జేఎల్‌ పోస్టుకు ఎంపికైన యోగేంద్రసింగ్‌

ఆదిలాబాద్‌టౌన్‌: జూనియర్‌ లెక్చరర్‌ రాత పరీక్ష ఫలితాల్లో ఆదిలాబాద్‌ జిల్లాకు చెందిన యోగేంద్రసింగ్‌ రాష్ట్రస్థాయిలో సత్తా చాటాడు. సోమవారం విడుదలైన ఫలితాల్లో జూనియర్‌ లెక్చరర్‌ హిందీ విభాగంలో 450 మార్కులకుగానూ 360 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకులో నిలిచాడు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్‌ అండ్‌ కామర్స్‌ కళాశాలలో 2015లో డిగ్రీ పూర్తి చేశారు. కళాశాలకు చెందిన విద్యార్థి జేఎల్‌కు ఎంపిక కావడం పట్ల మంగళవారం కళాశాలల ప్రిన్సిపాళ్లు అచ్చ శ్రీనివాస్‌, జలగం అనిత, హిందీ అధ్యాపకులు ప్రతాప్‌సింగ్‌ హర్షం వ్యక్తం చేస్తూ శాలువాతో సత్కరించారు.

ఆలయంలో చోరీ



చోరీకి గురైన హుండీ

నిర్మల్‌టౌన్‌: జిల్లా కేంద్రంలోని వెంకటాపూర్‌లోగల మహాదేవపురం ఆలయంలో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోని హుండీని పగులగొట్టి సుమారు రూ.10వేల నగదు ఎత్తుకెళ్లారు. ఉదయం ఆలయానికి వెళ్లిన స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్‌ తెలిపారు.

కొండముచ్చుకు అంత్యక్రియలు

తానూరు: మండలంలోని ఉమ్రి(కే) గ్రామంలో కొండముచ్చుకు హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. మంగళవారం కుక్కలు పొలంలో కొండముచ్చును వెంబడించగా అది భయంతో పరుగెత్తి విద్యుత్‌ స్తంభం ఎక్కింది. విద్యుత్‌ తీగలకు తగిలి షాక్‌తో మృత్యువాత పడింది. గ్రామస్తులు, యువకులు కొండముచ్చు కళేబరాన్ని కిందికి దింపి హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామానికి చెందిన నర్సయ్య, ఆనంద్‌రావ్‌, చంద్రకాంత్‌ తదితరులున్నారు.

గోరింటా పండింది..!

- ఆషాఢమాసం స్పెషల్‌..
- పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన
- మహిళా సంఘాల ఆధ్వర్యంలో మెహందీ వేడుకలు



గోరింటాకు చూపుతున్న కేజీబీవీ విద్యార్థినులు



ఆదిలాబాద్‌: చేతులకు గోరింటాకు చూపుతున్న మహిళలు



గోరింటాకు పెట్టుకుంటున్న కేజీబీవీ విద్యార్థినులు

మంచిర్యాలఅర్బన్‌: ఆషాఢ మాసం వచ్చిందంటేనే గోరింటాకు గుర్తుకు వస్తుంది. మహిళలు, యువతులు, చిన్నారుల చేతులు గోరింటాకుతో కళకళలాడుతుంటాయి. ఒకరికొకరు పోటీపడి మరీ పెట్టుకుంటారు. ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టుకుంటే రుతువు మారిన వేళ కాళ్లు, చేతులు, గోళ్లు శుభ్రపడుతాయని, రోగ నిరోధకంగా పనిచేయడంతో అంటువ్యాధులను కూడా దూరం చేస్తుందని నమ్మకం.

ఎర్రగా పండాలంటే..

గోరింటాకు ఎర్రగా పండాలంటే అందులో నిమ్మరసం కలపాలి. దీంతో పాటు గోరింటాకు రుబ్బేటప్పుడు రవ్వంత చింతపండు వేసినా మంచి ఉపయోగం ఉంటుంది. గోరింటాకు పెట్టుకున్న తర్వాత అది పూర్తిగా ఎండిపోయి రాలిపోయే స్థితిలోకి వచ్చాక తీసేయాలి. అలా తీసివేసిన వెంటనే చేతులను శుభ్రం చేసుకోవాలి. ఆ తర్వాత చేతులకు కొద్దిగా నూనె రాస్తే గోరింటాకు మంచి కలర్‌లోకి వస్తుంది.

ఒంట్లోని వేడిని తగ్గించే ఔషధ గుణం..

గోరింటాకు ఒంట్లోని వేడిని తగ్గించే ఔషధ గుణం కలిగి ఉంటుంది. బయటి వాతావరణానికి అనుగుణంగా శరీరాన్ని కూడా చల్లబరిచి దోషాల బారిన పడకుండా శరీరానికి మేలు చేస్తుంది. ఆషాఢంలో కొత్త పెళ్లి కూతుళ్లు పుట్టింటికి చేరుకోవడం తరాల నుంచీ ఆనవాయితీగా వస్తోంది. గోరింటాకు మహిళలకు తమ సౌభాగ్యాన్ని గుర్తు చేస్తుంది. గోరింట ఆకులే కాదు.. పూలు, వేళ్లు, బెరడు విత్తనాలు అన్నీ ఔషధయుక్తాలేనని నిపుణులు చెబుతున్నారు. కేజీబీవీతోపాటు పలు విద్యాసంస్థల్లో గోరింటాకు విశిష్టతను తెలిపేలా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు.

ఉపాధి మార్గంగా ..

ఒకప్పుడు ఇంటిల్లిపాది గోరింటాకును ముద్దలుగా చేసి ఒకరి చేతికి మరొకరు అరచేయి, చేతివేళ్లు, కాళ్లకు పెట్టుకునే వారు. ఈ మాసంలో గోరింటాకుకు గ్రామీణ ప్రాంతాల్లో మంచి డిమాండ్‌ ఉంటుంది. అంతేకాకుండా వివాహాది శుభకార్యాలకు మెహందీగా వివిధ ఆకృతుల్లో తీర్చిదిద్దటానికి కొంతమందికి ఉపాధి మార్గంగా కూడా మారింది.

మహిళల సంబరాలు

ఆషాఢమాసం పురస్కరించుకుని మంగళవారం పాత మంచిర్యాలలోని రామాలయంలో మహిళలు గోరింటాకు సంబరాలు నిర్వహించారు. లలితా పారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు ఒకరికొకరు గోరింటాకు పెట్టుకుని ఉల్లాసంగా గడిపారు.

హౌసింగ్‌ బోర్డ్‌ కాలనీలో వేడుకలు

ఆదిలాబాద్‌: జిల్లా కేంద్రంలోని హౌసింగ్‌ బోర్డ్‌ కాలనీలో సోమవారం రాత్రి గోరింటాకు వేడుకలు నిర్వహించారు. కాలనీకి చెందిన పలువురు మహిళలు అమ్మవారిని ప్రతిష్ఠించి, ప్రత్యేక పూజలు నిర్వహించి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ మహిళలు రాణి, విజయలక్ష్మి, మీనా, రజిని, రజిత, లావణ్య, సరోజ, మల్లీశ్వరి, మాలతి, తదితరులు ఉన్నారు.

మహిళలకు ప్రత్యేకం



ఆషాఢ మాసం మహిళలకు ప్రత్యేకం. ఈ మాసంలో నోములు, వ్రతాలతో పాటు వన భోజనాలతో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తాం. ముఖ్యంగా సౌభాగ్యం కోసం గోరింటాకు పెట్టుకుని సంప్రదాయాలను గౌరవిస్తాం.

– బోలిశెట్టి సునీత, కౌన్సిలర్‌, మంచిర్యాల

గాజులు ఇచ్చిపుచ్చుకుంటాం



ఆషాఢమాసం వచ్చిందంటే ముందుగా గుర్తుకు వచ్చేది గోరింటాకు. అందరం ఒకే చోట చేరి గోరింటాకు పెట్టుకోవటంతో పాటు గాజులు ఇచ్చిపుచ్చుకుంటాం. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి గోరింటాకు పెట్టుకోవడం ఆనందంగా ఉంటుంది.

– కమటం సుజాత, పాత మంచిర్యాల

ఆరోగ్యానికి మంచిది



గోరింటాకు ఆరోగ్యానికి మంచిది. గోరింటాకు వేడుకలను ఏటా నిర్వహిస్తాం. సామూహికంగా పండుగ జరుపుకుంటాం. గోరింటాకుతో చర్మవ్యాధుల బారి నుంచి రక్షణ పొందవచ్చు. ఇది దొరకని వారు కోన్లను కొనుగోలు చేస్తుంటారు. మెహందీ కోన్లు కొనేముందు జాగ్రత్తగా పరిశీలించాలి.

– పానుగంటి వైష్ణవి, లలితా పారాయణ సేవా సభ్యురాలు

చిన్ననాటి నుంచీ..



ఆదిలాబాద్‌టౌన్‌: ఆషాఢ మాసంలో మహిళలు గోరింటాకు పెట్టుకోవడం ఆనవాయితీ. నా చిన్నతనం నుంచి గోరింటాకు పెట్టుకుంటున్నా. గోరింటాకు తెంపి రోట్లో వేసి ముత్తయిదువలంతా కలిసి పాటలు పాడుతూ దంచుతారు. ఒకచోట చేరి సంబరాలు జరుపుకుంటాం.

– సంధ్య, ఓల్డ్‌ హౌజింగ్‌బోర్డు

సంస్కృతికి ప్రతీక



ఆదిలాబాద్‌టౌన్‌: ఆషాడ మాసంలో మహిళలు గోరింటాకు పెట్టుకోవడం సంస్కృతి, సంప్రదాయాల్లో ఒక భాగంగా మారింది. వర్షాకాలంలో తడిస్తే అనారోగ్యం బారిన పడే అవకాశం ఉంది. అలా జరగకుండా గోరింటాకు శరీరానికి వెచ్చదనం ఇస్తూ వ్యాధులు రాకుండా కాపాడుతుంది.

– సరళ, ఆదిలాబాద్‌

అనాదిగా ప్రత్యేకత..



ఆదిలాబాద్‌టౌన్‌: గోరింటాకును గౌరింటాకు అని కూడా అంటారు. పూర్వకాలంలో పార్వతీదేవి చిన్నతనంలో ఉద్యానవనానికి వెళ్లినప్పుడు రక్తపుచుక్క గోరింటాకుపై పడుతుంది. అప్పటి నుంచి ఆ గోరింటాకు పెట్టుకుంటే చేతులు ఎర్రగా మారుతున్నాయని పూర్వీకులు చెబుతున్నారు.

– పోలా పారిజాత, హౌజింగ్‌బోర్డు

గౌరి ఇంటి ఆకు



ఆసిఫాబాద్‌ అర్బన్‌: గోరింటాకు అంటే గౌరి ఇంటి ఆకుగా భావిస్తారు. ఇంట్లో ఏ శుభకార్యమైనా మొదట గోరింటాకుకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తారు. నేడు వివాహాలకు మూడు రోజుల ముందే ప్రత్యేకంగా మెహందీ పేరుతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

– అఖిల, గృహిణి

ఆనవాయితీగా వస్తోంది



ఆసిఫాబాద్‌ అర్బన్‌:నాకు గోరింటాకు పెట్టుకోవడం చాలా ఇష్టం. ముఖ్యంగా ప్రతీ మహిళ ఆషాఢంలో గోరింటాకు పెట్టుకోవడం ఆనవాయితీగా వస్తోంది. గోరింటాకు పెట్టుకుంటే పెళ్లికాని యువతులకు గుణవంతుడైన భర్త లభిస్తాడని నమ్ముతారు.

– కాసర్ల శ్రీదేవి, గృహిణి

రోగ నిరోధక శక్తి పెంచుతుంది



ఆసిఫాబాద్‌ అర్బన్‌:గోరింటాకుకు శరీరంలో ఉండే వేడిని తగ్గించే శక్తి ఉంది. అంతేకాకుండా రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. ఆధ్యాత్మిక పరంగా గోరింటాకు సౌభాగ్యానికి ప్రతీక అని.. ఆషాఢంలో మహిళలు గోరింటాకు పెట్టుకోవడం ద్వారా సౌభాగ్యాన్ని పొందుతారని జోతిష్యులు పేర్కొంటున్నారు.

– నిమ్మకంటి కీర్తి, గృహిణి

కాలినడకన వెళ్లి.. వైద్యపరీక్షలు చేసి..



గుట్టల మధ్య నుంచి కాలినడకన వెళ్తున్న వైద్యులు



ఆదిలాబాద్‌రూరల్‌: మండలంలోని మామిడిగూడ సబ్‌ సెంటర్‌ పరిధిలోని వాన్‌వాట్‌ గ్రామ పంచాయతీ పరిధిలో గల మారుమూల గిరిజన గ్రామమైన మంగ్లీకి రోడ్డు సౌకర్యం లేదు. వర్షాకాలంలో గ్రామస్తులు సీజనల్‌ వ్యాధుల బారిన పడకుండా ముందస్తుగా అంకోలి పీహెచ్‌సీ వైద్యులు మంగళవారం ఆరు కిలోమీటర్లు కాలినడకన వెళ్లి వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు వైద్యాధికారి సర్ఫారాజ్‌ తెలిపారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌ వైజర్‌ మర్సుకోల లక్ష్మీబాయి, ఆరోగ్య కార్యకర్తలు నల్ల ఈశ్వర్‌ రెడ్డి, పవార్‌ ప్రేంసింగ్‌, రాథోడ్‌ నారాయణ్‌, ముయ్యాల మోతి, ఆశా కార్యకర్తలు సుమిత్ర, రుక్మిణి, తుర్పాబాయి పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీలో కొనసాగుతున్న కౌన్సెలింగ్‌



ఎంపికపత్రం అందజేస్తున్న అధికారులు

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో 2024–25 విద్యా సంవత్సరంలో ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతోంది. ఎంపికైన విద్యార్థులకు రెండోరోజు మంగళవారం కౌన్సెలింగ్‌ నిర్వహించారు. భూపాలపల్లి జిల్లా ఘన్‌పూర్‌ గ్రామానికి చెందిన కోలన్‌ తనూజాకు మొదటి ఎంపికపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్పెషల్‌ ఆఫీసర్‌ సృజన మాట్లాడుతూ బుధవారం కూడా కౌన్సెలింగ్‌ కొనసాగుతుందని, 1001 నుంచి 1404 వరకు ఉన్న విద్యార్థులు హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్‌ డీన్‌ మహేశ్‌, జాయింట్‌ కన్వీనర్‌ పావని, రంజిత్‌కుమార్‌, డా.దత్తు, అడ్మిషన్‌ కమిటీ సభ్యులు హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గిరి గ్రామాల్లో అకాడి పూజలు



ఇంద్రవెల్లి: వన దేవతలకు మొక్కుతున్న ఆదివాసీలు

ఇంద్రవెల్లి: మండలంలోని గిరిజన గ్రామాల్లో ఆదివాసీలు మంగళవారం అకాడి పూజలను ఘనంగా నిర్వహించారు. వాల్గొండ, డొంగర్‌గామ్‌, హీరాపూర్‌ తదితర గ్రామాల పొలిమేరలో వనదేవతలకు పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. వన దేవతలకు పూజలు చేయడం ద్వారా అడవిలో మేతకు వెళ్లిన మూగజీవాలకు జంతువులతో ఎలాంటి హాని జరగదని ఆదివాసీల నమ్మకం.

సిరికొండ: మండలంలోని కోసుపటేల్‌ గూడలో అకాడి సంబురాలు జరుపుకున్నారు. గ్రామ శివారులోని రాజుల్‌ దేవత వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంటలు సమృద్ధిగా పండాలని, తమ పశువులకు ఎలాంటి వ్యాధులు రాకుండా ఆరోగ్యంగా ఉంచాలని వన దేవతలకు మొక్కుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పటేల్‌, మహాజన్‌, దేవారీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్టీసీ త్రైమాసిక పురస్కారాలు



నగదు పురస్కార గ్రహీతలతో డీఎస్పీ, ఆర్‌ఎం

ఆదిలాబాద్‌: ఆర్టీసీ రీజియన్‌ పరిధిలో ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు సంస్థ ఆర్‌ఎం సోలోమన్‌, డీఎస్పీ జీవన్‌రెడ్డితో కలిసి ప్రగతిచక్రం త్రైమాసిక పురస్కారాలు అందించారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన వారికి నగదు పురస్కారాలతో పాటు జ్ఞాపికలు అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రయాణికుల రక్షణే పరమావధిగా సేవలందించాలన్నారు. ఉత్తమ ఉద్యోగులకు తప్పకుండా గుర్తింపు లభిస్తుందన్నారు. ఇందులో భాగంగా పురస్కారాలు అందజేసినట్లు తెలిపారు. అలాగే గతేడాది అక్టోబర్‌ 18 నుంచి 30వ తేదీ వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన లక్కీ డ్రా విజేతలకు రూ.9,900 నగదు పురస్కారం అందించారు. ఇందులో డిప్యూటీ ఆర్‌ఎం ప్రణీత్‌, డిపో మేనేజర్‌ కల్పన తదితరులున్నారు.


ఐరన్‌ బ్రిడ్జి ఏర్పాటు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే శంకర్‌

ఆదిలాబాద్‌: జైనథ్‌ మండలంలోని తర్నం వంతెన వద్ద ఐరన్‌ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే పాయల్‌ శంకర్‌ మంగళవారం ఎన్‌హెచ్‌ఏఐ రీజినల్‌ ఆఫీసర్‌ ఎస్‌.కే.కుశ్వాహకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తర్నం బ్రిడ్జి కుంగిపోవడం వలన తాత్కాలిక రహదారి ఏర్పాటు చేశారని, వరద ప్రవాహం కారణంగా కొట్టుకుపోయిందని వివరించారు. జైనథ్‌, బేల మండలాలకు, మహారాష్ట్ర వైపునకు వెళ్లే ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఎమ్మెల్యే వెంట బీజేపీ నాయకుడు ముస్తాపురే అశోక్‌ ఉన్నారు.

పీఆర్‌ ఎస్‌ఈగా జాదవ్‌ ప్రకాశ్‌



అభినందిస్తున్న అధికారులు, ఉద్యోగులు

కైలాస్‌నగర్‌: పంచాయతీరాజ్‌ ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లా సూపరింటెండెంట్‌ ఇంజినీర్‌ (ఎస్‌ఈ)గా జాదవ్‌ ప్రకాశ్‌ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు పని చేసిన ఎస్‌ఈ వెంకట్‌రావు పదవీ విరమణ పొందారు. మంచిర్యాల జిల్లా ఈఈ(టెక్నికల్‌)గా పనిచేస్తున్న ప్రకాశ్‌కు ఎస్‌ఈగా పదోన్నతి కల్పించిన ప్రభుత్వం ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాకు నియమించింది. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన ప్రకాశ్‌కు ఈఈ రాథోడ్‌ శివరాం, డీఈ కుందన్‌ రాథోడ్‌ తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలను తెలిపారు.

ప్రమాదవశాత్తు లారీ డ్రైవర్‌ మృతి



వడివేలు తంగవేలు (ఫైల్‌)

నేరడిగొండ: ప్రమాదవశాత్తు లారీ డ్రైవర్‌ మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్‌ తెలిపిన వివరాల ప్రకారం తమిళనాడు నుంచి ఢిల్లీకి రబ్బర్‌ లోడ్‌తో వెళ్తున్న లారీ సోమవారం అర్ధరాత్రి మండలంలోని ఆరెపల్లి సమీపంలో గల జాతీయ రహదారిపై నిలిచిపోయింది. డ్రైవర్‌ వడివేలు తంగవేలు (31) లారీ దిగి టైర్లను చూస్తుండగా ఒక్కసారిగా వెనక్కి రావడంతో టైర్లకింద ఇరుక్కుని అక్కడికక్కడే మృతి చెందాడు. హ్యాండ్‌ బ్రేక్‌ వేయకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందని అందులోని మరో డ్రైవర్‌ తెలిపినట్లు ఎస్సై వివరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో గేదె మృతి

కుభీర్‌: మండలంలోని నిగ్వా గ్రామంలో మంగళవారం మేత మేస్తున్న గేదెపై విద్యుత్‌ తీగ పడటంతో రైతు సింగోల్ల లింగంకు చెందిన గేదె మృతిచెందింది. మరో ఐదు గేదెలు అక్కడే ఉండగా రైతు వాటిని పక్కకు తోలడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కొద్ది దూరంలో ఆరుగురు మహిళా రైతులు పనిచేస్తుండగా వారికి అపాయం తప్పింది. మృతి చెందిన గేదె విలువ రూ.50 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు. విద్యుత్‌ అధికారులు పరిహారం ఇప్పించి ఆదుకోవాలని కోరాడు.

తిర్పెల్లిలో కొండచిలువ

లక్ష్మణచాంద: మండలంలోని తిర్పెల్లి గ్రామంలో కొండచిలువ కనిపించింది. మంగళవారం ఉదయం గ్రామానికి చెందిన రైతు లస్మయ్య తన ఇంటి ఆవరణలో పశువుల మేత తీస్తున్నాడు. ఈక్రమంలో కొండచిలువ కోడిని నోట కరిచి కనిపించింది. దీంతో లస్మయ్య ఇరుగుపొరుగువారికి సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకుని దానిని చంపివేశారు.

అంగన్‌వాడీ ఆయాల భిక్షాటన

కైలాస్‌నగర్‌: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల రిటైర్మెంట్‌ బెనిఫిట్స్‌ను పెంచాలనే డిమాండ్‌తో అంగన్‌వాడీ టీచర్స్‌, హెల్పర్స్‌ యూనియన్‌ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి రెండోరోజుకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ భిక్షాటన చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్‌ జిల్లా అధ్యక్షురాలు వెంకటమ్మ మాట్లాడుతూ పదవీ విరమణ పేరిట అంగన్‌వాడీలు, ఆయాలకు ప్రభుత్వం తీవ్ర నష్టం కలిగిస్తుందన్నారు. ప్రభుత్వం జారీ చేసిన జీవోను రద్దు చేసి ప్రయోజనాలను పెంచేలా కొత్త జీవో జారీ చేయాలని డిమాండ్‌ చేశారు. అప్పటి వరకు తమ నిరసనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

రేషన్‌ దుకాణం సీజ్‌

నార్నూర్‌: తాడేహత్నూర్‌ గ్రామంలోని రేషన్‌ దుకాణాన్ని మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్‌ నాయబ్‌ తహసీల్దార్లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణంలో రికార్డులు, ఎలక్ట్రానిక్‌ కాంటాతో పాటు బయోమెట్రిక్‌ యంత్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుకాణంలో 81.50 క్వింటాళ్ల బియ్యం తక్కువగా ఉండడంతో నిత్యావసరాల చట్టం ప్రకారం దుకాణాన్ని సీజ్‌ చేసి డీలర్‌ జాదవ్‌ బాలాజీపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయబ్‌ తహసీల్దార్లు మధుసూదన్‌, బాబుసింగ్‌, ప్రేంనివాస్‌, రవీందర్‌, తదితరులు పాల్గొన్నారు.